జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
మంగళవారం | 15 | అక్టోబర్ | 2024 ◆ పేజీలు : 6

## స్మార్ట్ సిటీ పనులు వేగవంతం చేయండి



2లో...



## క్రీడారంగం అభివృద్ధికి...
# సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ

**గ్రామీణ క్రీడ రంగానికి అధిక ప్రాధాన్యత**

**గత ప్రభుత్వం క్రీడా రంగాన్ని నిర్వీర్యం చేసింది**

**పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు**

**జిల్లాకు చేరిన సీఎం కప్ క్రీడాజ్యోతి**

*సుల్తానాబాద్, అక్టోబర్14, ప్రజాజ్యోతి*

రాష్ట్రంలో క్రీడా రంగం అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, క్రీడల్లో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపే దిశగా కృషి చేస్తున్నారని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, అడిషనల్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ అన్నారు.సీఎం కప్ రిలే ర్యాలీ సోమవారం సుల్తానాబాద్ పట్టణం శాస్త్రి నగర్ నుండి ప్రారంభమై ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వరకు పెద్దపల్లి డివైఎస్ఓ సురేష్ ఆధ్వర్యంలో కొనసాగింది.ఈ కార్యక్రమానికి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నవంబర్లో సీఎం కప్ పోటీలు నిర్వహిస్తుందని అన్నారు.విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు సైతం విద్యార్థులను క్రీడలు ఆడే విధంగా ప్రోత్సహించాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా క్రీడాకారుడు కావడంతో క్రీడల పట్ల మక్కువ చూపిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 2లో...

## జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన సత్తు మల్లేశం



కరీంనగర్ బ్యూరో, ప్రజాజ్యోతి

జిల్లా గ్రంధాల సంస్థ చైర్మన్ గా సత్తు మల్లేశం సోమవారం జిల్లా కేంద్రంలోని గ్రంధాలయంలోని తన ఛాంబర్ లో వేద పండితులు ఆశీర్వాదంతో పదవి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పలువురు కాంగ్రెస్ శ్రేణులు సన్మానించి అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా సత్తు మల్లేశం మాట్లాడుతూ నాకు ఈ పదవి రావడానికి కృషి చేసిన గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, శాసన సభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్య నారాయణ, మేడిపల్లి సత్యం, విజయ రమణారావు, సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి,

2లో...




# యజమాని మృతిని భరించలేక శునకం మృతి

**దివంగత నేత తుమ్మేటి సమ్మిరెడ్డి ప్రేమగా పెంచుకున్న శునకం**

**ఫోటో వైపు చూస్తూ ఆహారం మానేసిన శునకం**

**సరిగ్గా నెల మాసికం రోజు శునకం మృతి**

**శునకం మృతి చూసి తుమ్మేటి కుటుంబ సభ్యుల కంటతడి**



*జమ్మికుంట, అక్టోబర్14, ప్రజాజ్యోతి*

కుక్క.. విశ్వాసానికి పెట్టింది పేరు. మనిషిని చేరదీస్తే.. విషం కక్కుతాడేమోగానీ కుక్కను పెంచి పోషిస్తే మాత్రం అది విశ్వాసాన్ని మాత్రమే చూపుతుంది...ఒక్కసారి దాని కడుపు నింపితే.. చచ్చేదాకా అది ఎంతో విశ్వాసంగా ఉంటుంది. ఆస్తులు, అంతస్తులు ఇచ్చినా తల్లిదండ్రులను పట్టించుకోని మనుషులున్న ఈ రోజుల్లో కుక్కలను ఆదరిస్తే అవి మనుషులపై చూపించే ప్రేమ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. విశ్వాసానికి మారుపేరుగా అవి ప్రవర్తిస్తుంటాయి. ఆపద ఎదురైనప్పుడు ప్రాణాన్ని కూడా పణంగా పెట్టి యజమానుల్ని కాపాడుకున్న ఘటనలు గతంలోనే వెలుగు చూశాయి. పాములతో పోరాడి మరణించిన శునకాల కథలు, వీడియోలు అనేకం చూశాము..అలాంటి సంఘటనే జమ్మికుంట పట్టణంలో చోటు చేసుకుంది...గత నెల సెప్టెంబర్ 14న జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ

మిగతా 2లో...

# స్మార్ట్ సిటీ పనులు వేగవంతం చేయండి

**కరీంనగర్ బ్యూరో, ప్రజాజ్యోతి**

స్మార్ట్ సిటీ పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్మార్ట్ సిటీలో భాగంగా జిల్లా కేంద్రంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా చేపట్టిన జంక్షన్ నిర్మాణ పనులను, అంబేద్కర్ స్టేడియంలో నిర్మించిన కాంప్లెక్స్ ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్మార్ట్ సిటీ పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పూర్తి చేయించాలన్నారు. నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలు విధిగా పాటించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. వారి వెంట అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ప్రపుల్ దేశాయ్, నగరపాలిక కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, ట్రైనీ ఐఏఎస్ అజయ్ కుమార్, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

# జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన సత్తు మల్లేశం

(మొదటి పేజీ తరువాయి...)

పూరుమల్ల శ్రీనివాస్ లకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని, నాపై నమ్మకంతో నాకు ఈ పదవి ఇచ్చినందుకు నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రంథాలయ అభివృద్ధికి పాటుపడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. సిరాజ్ హుస్సేన్, వంగల విద్యాసాగర్, గంగుల దిలీప్ కుమార్, సిరిపురం లావణ్య నాగప్రసాద్, కామ్రెడ్డి రాంరెడ్డి, సాయిని తిరుపతి, మాదాసు శ్రీనివాస్, రోళ్ళ సతీష్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మంద మహేష్, ముద్దసాని రంగన్న, పెద్ది గారి తిరుపతి, బుర్ర హరీష్ గౌడ్, రూపు రెడ్డి శ్రీనివాసరెడ్డి, మారుతీ రావు, తదితరులు పాల్గొన్నారు.

# యజమాని మృతిని భరించలేక శునకం మృతి



(మొదటి పేజీ తరువాయి...)

మాజి చైర్మన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుమ్మేటి సమ్మిరెడ్డి గుండెపోటుతో చనిపోయారు... తుమ్మేటి సమ్మిరెడ్డి కి కుక్కలంటే ఎంతో ఇష్టం. కొన్నేళ్లుగా ఆయన ఎన్నో శునకాలను పెంచుకుంటున్నారు...వాటిని గారాబంగా కుటుంబ సభ్యుల్లాగానే చూసుకునేవారు. తుమ్మేటి మృతి చెందిన రోజు నుండి తను ఇష్టంగా పెంచుకున్న శునకం తన యజమాని చనిపోయాడని తెలుసుకొని, ఇంట్లో దండ వేసి ఉన్న తుమ్మేటి సమ్మిరెడ్డి ఫోటోను చూస్తూ, అరుస్తూ ఏడుస్తూ, ఫోటో పక్కనే కూర్చొని తిండి మానేసి అహర్నిశలు రోధిస్తున్న ఘటన చూసి తుమ్మేటి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వచ్చే వివిధ రాజకీయ నాయకులను, మిత్రులను, శ్రేయోభిలాషులను కలచివేసింది...సోమవారం తుమ్మేటి సమ్మిరెడ్డి నెల మాసికం కాగా తుమ్మేటి సమ్మిరెడ్డి అల్లారు ముద్దుగా పెంచుకున్న శునకం తీవ్ర మనస్తాపానికి గురై గుండె కొట్టుకోవడం ఆగి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు శోకతప్త హృదయం తో తెలిపారు..చనిపోయిన యజమాని పట్ల శునకం చూపించిన విశ్వాసానికి స్థానికులు ఆశ్చర్యపోతున్నారు.. ఫోటో వైపు చూస్తూ ఆహారం మానేసిన శునకం చివరికి మృతిచెంది యజమాని చెంతకు వెళ్లడం కుటుంబ సభ్యులు స్థానికులను కంటతడి పెట్టిస్తోంది....

## క్రీడారంగం అభివృద్ధికి...

# సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ




(మొదటి పేజీ తరువాయి...)

క్రీడాకారులకు ఉన్నత ఉద్యోగాలతో పాటు నగదు పురస్కారాలు, ముఖ్య కూడళ్లలో ఖరీదైన స్థలాలు ఇస్తూ ప్రోత్సహిస్తుందని అన్నారు. గత ప్రభుత్వం క్రీడా రంగాన్ని నిర్వీర్యం చేసిందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సుల్తానాబాద్ పోలీస్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కన్నం మధు నోడల్ ఆఫీసర్, గోకుల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, రతన్ కుమార్ బోస్ స్పోర్ట్స్ ఆఫీసర్, ఎండి గౌస్ నేషనల్ అథ్లెటిక్ కోచ్, సుల్తానాబాద్ సిఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్ కుమార్, పెద్దపల్లి ట్రాఫిక్ సిఐ అనిల్ కుమార్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, పెద్దపల్లి జిల్లా పేట అధ్యక్షుడు వేల్పుల సురేందర్, జనరల్ సెక్రెటరీ దాసరి రమేష్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు కడారి రవీందర్, మాజీ ఎస్ జి ఎఫ్ కార్యదర్శి శంకరయ్య, బైరగోని రవీందర్, దాసరి ప్రసాద్, అంతర్జాతీయ క్రీడాకారుడు గెల్లు మధుకర్, కుమార్ కిషోర్, క్రీడా సంఘాల నాయకులు పెద్దపల్లి జిల్లా రబ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లపల్లి మనోజ్ గౌడ్, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొల్లి సత్యనారాయణ, అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గట్టయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రణయ్, కుమార్, సదానందం, వెంకటేష్, హరికృష్ణ, ఇక్బాల్, శివ, అజ్జు, సతీష్, పవన్, సంపత్, మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, , క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వేములవాడ ఆలయ అభివృద్ధికి చర్యలు





**రాజన్న ఆలయ అభివృద్ధి పై సీఎం ప్రత్యేక దృష్టి**

**భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులు కల్పిస్తాం**

**ఆలయానికి బంగారు తాపడం, వెండితో పల్లకి, ఉత్సవ మూర్తుల తయారీకి ప్రణాళికలు**

**రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

**కుటుంబ సభ్యులతో కలిసి రాజన్న దర్శనం**

**కరీంనగర్, అక్టోబర్ 14, ప్రజాజ్యోతి**

యాదాద్రి తరహాలో వేములవాడ ఆలయాన్ని ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రభుత్వం తీసుకుంటుందని రాష్ట్ర దేవాదాయ శాఖ చర్యలు మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం వేములవాడ పట్టణంలో పర్యటించిన రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కు మార్ఝ, ఎస్పీ అఖిల్ మహాజన్ పుష్ప గుచ్చం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం" సమర్పించారు. వేములవాడ రాజన్న ఆలయం అర్చకులు పూర్ణకుంభంతో మంత్రికి ఆలయంలోకి స్వాగతం పలికారు. వేద పండితుల ఆశీర్వాదం మధ్యలో మంత్రి స్వామివారి దర్శనం చేసుకుని కోడే మొక్కలు చెల్లించారు. రాజన్న దేవాలయం సన్నిధిలో మనవడి పుట్టి వెంట్రుకల కార్యక్రమాన్ని మంత్రి కుటుంబ సభ్యుల తో పూర్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాజన్న దేవాలయ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, త్వరలోనే రాజన్న దేవాలయ అభివృద్ధి పై సీఎం స్థాయిలో అత్యున్నత సమావేశం జరుగుతుందని, శాస్త్రాల ప్రకారం ప్రకారం ఆలయ అభి వృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొం దిస్తుందని అన్నారు. భక్తులకు ఎటు వంటి అసౌకర్యం కలగకుండా అవస రమైన అన్ని రకాల వసతులను కల్పిస్తూ ఆలయ అభివృద్ధికి తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలవకుండా చర్యలు తీసుకున్నామని, స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సైతం ఆలయ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారని అన్నారు. యాదాద్రి తరహాలో వేములవాడ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, యాదాద్రి ఆలయానికి 63 కేజీల బంగారంతో తాపడం ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. వేములవాడ దేవాలయం వద్ద 65 కేజీల బంగారం 5000 కిలోల వెండి అందుబాటులో ఉందని వీటిని విని యోగించుకొని ఆలయానికి బంగారు తాపడం, వెండితో పల్లకీలు, ఉత్సవ విగ్రహాలు రూపొం దించేందుకు ప్రణాళి కలు తయారు చేస్తున్నామన్నారు. అనం తరం మంత్రి బద్ది పోచమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పర్యటనలో మంత్రి వెంట ఆలయ ఈ.ఓ. వినోద్ రెడ్డి, వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ మహేష్, అర్.డి. ఓ. రాజేశ్వర్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి బిడ్డకు డాక్టరేట్ పట్టా

### నువ్వులలో జన్యుపరమైన అంచనా అనే అంశంపై రీసెర్చ్

### డాక్టరేట్ ప్రదానం చేసిన జవహర్ లాల్ నెహ్రూ కృషి విశ్వవిద్యాలయం

### రంజిత్ కు అభినందనల వెల్లువ

**జమ్మికుంట, అక్టోబర్ 14, ప్రజా జ్యోతి**






జమ్మికుంట పట్టణానికి చెందిన గంగిశెట్టి రంజిత్ కుమార్ కు మధ్యప్రదేశ్ లోని జబల్ పూర్ జవహార్ లాల్ నెహ్రూ కృషి విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. దిగువ మధ్య తరగతి చిరు వ్యాపారి కుటుంబానికి చెందిన రంజిత్ కుమార్.."నువ్వులలో జన్యుపరమైన అంచనా" అనే అంశంపై పీహెచ్ డీ చేశారు... గంగిశెట్టి స్వరూపరాణి – రవీందర్..దంపతుల మూడో సంతానం రంజిత్ కుమార్ కాగా చిన్నప్పటి నుంచి చదువుల్లో రాణిస్తున్నారు. పిల్లల చదువు నిమిత్తం తల్లిదండ్రులు స్వరూపారాణి రవీందర్.. తమ సొంతూరు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలకేంద్రం నుంచి జమ్మికుంట పట్టణానికి తమ నివాసాన్ని మార్చుకున్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని చిన్ననాటి నుంచి గమనించిన రంజిత్ ఉన్నత చదువులు చదివి ప్రయోజకుడై లెక్చరర్ గా ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం శ్రీకృష్ణదేవరాయల ఉద్యానవన కాలేజీలో ఉద్యోగం చేస్తున్నారు. తాజాగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. తమ కుమారుడు డాక్టరేట్ సాధించడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు..మొగుళ్లపల్లి, జమ్మికుంట లో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేసిన రంజిత్ ఇంటర్..వరంగల్ లో, డిగ్రీ.. హైదారాబాద్ లోని కొండా లక్ష్మణ్ ఉద్యాన వర్సిటీ, పీజీ..పశ్చిమ బెంగాల్ లోని విశ్వభారతి విశ్వవిద్యాలయంలో కంప్లీట్ చేశారు..పీ హెచ్ డీ ని జవహార్ లాల్ నెహ్రూ కృషి విశ్వవిద్యాలయంలో 'డార్క్ బ్రౌన్ సెసామె జెనెటిక్ అసెస్ మెం, ట్' అనే అంశంపై ప్రొఫెసర్ రజని బిసెన్ మార్గదర్శనంలో రంజిత్ కుమార్ తన రీసెర్చ్ కొనసాగించారు. ఇటీవల జరిగిన స్నాతకోత్సవంలో జవహార్ లాల్ నెహ్రూ కృషి విశ్వవిద్యాలయంలో వర్సిటీ వైస్ చాన్స్ లర్ ప్రొఫెసర్ పీకే మిశ్రా డాక్టరేట్ ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ ను తోటి స్నేహితులు, విద్యార్థులు, బంధు మిత్రులు, మొగుళ్లపల్లి గ్రామస్తులు, జమ్మికుంట పట్టణవాసులు అభినందిస్తున్నారు. డాక్టరేట్ పట్టా పొందిన ఉన్నత విద్యావంతుడైన రంజిత్ భవిష్యత్ లో మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# జగిత్యాల ఉడిపి హోటల్ సీజ్

### తప్పు చేస్తే ఎంతటి వారిని ఉపేక్షించేది లేదు

### ఫుడ్ సెక్యూరిటీ ఆఫీసర్ అనూష

**ప్రజా జ్యోతి ఎఫెక్ట్**





**జగిత్యాల అర్బన్, అక్టోబర్ 14, ప్రజా జ్యోతి**

జగిత్యాల పట్టణంలోని తహసీల్ చౌరస్తా వద్ద గల గణేశ్ భవన్ ఉడిపి హోటల్ ను సోమవారం ఫుడ్ సెప్టీ ఇన్స్పెక్టర్ అనూష తనిఖీ చేశారు. ఆదివారం నాడు ఈ హోటల్ నుండి టిఫిన్ పార్సిల్ తీసుకువెళ్లగా ఇడ్లిలో జెర్రి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే సదరు యువతి హోటల్ ఎదుట ఆందోళనకు దిగడంతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. వారికి అందిన సమాచారం మేరకు ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీ చేసి నిబంధనల మేరకు నిర్వాహణ తీరు లేకపోవటంతో హోటల్ ను సీజ్ చేశారు. అయితే హోటల్ లో తనిఖీలకు సంబంధించి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఫుడ్ ఇన్స్పెక్టర్ అనుష వెల్లడించారు.

# అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని తహశీల్దార్ కి ఫిర్యాదు

### సుమారు ఎకరం భూమి ఆక్రమణ

### కొరపల్లి చెరువులో విద్యుత్ అధికారులు అక్రమ నిర్మాణం

**జమ్మికుంట, అక్టోబర్14, ప్రజా జ్యోతి**



జమ్మికుంట మండలంలోని కొరపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న గ్రామ చెరువు పరిధిలో విద్యుత్ శాఖ అధికారులు అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణం ఆపాలని జమ్మికుంట తహాశీల్దార్ కి పిర్యాదు చేసినట్లు తాటికంటి దిలీప్ కుమార్ తెలిపారు..ఈ సందర్భంగా తాటికంటి దిలీప్ కుమార్ మాట్లాడుతూ కొరపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న చెరువు పరిధిలో విద్యుట్ శాఖ అధికారులు సుమారు ఎకరం భూమి ఆక్రమించి అందులో సబ్ స్టేషన్ కోసం అక్రమ నిర్మాణం చేపడుతున్నరని ఇది చెరువులో నీటికి అనుకోని ఉందని ఆరోపించారు..ఈ నిర్మాణానికి ఎవరు అనుమతి ఇచ్చారో సర్వే చేసి అక్రమంగా నిర్మాణం చేస్తున్న విద్యుత్ అధికారులపై, నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్ పై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.. ఈ అక్రమ నిర్మాణం ద్వారా చెరువు యొక్క నీటి సామర్థ్యం తగ్గి గ్రామ ప్రజలకు భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడుతుందన్నారు.. భవిష్యత్ లో అతివృష్టితో వర్షాలు కురిసినట్లయితే సబ్ స్టేషన్ కూడా మునిగిపోయి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం కూడా ఉందని అన్నారు.. భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే ఆక్రమించిన భూమిలో అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని తహశీల్దార్ ని కోరగా వారు ఇచ్చిన ఫిర్యాదుకు తహశీల్దార్ సానుకూలంగా స్పందించి త్వరలోనే సర్వే చేపించి భూమి అన్యక్రాంతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు..

### జమ్మికుంట రూరల్ విద్యుత్ శాఖ ఏఈ రమేష్ వివరణ

జమ్మికుంట తహశీల్దార్ కి కొరపల్లి కి చెందిన తాటికంటి దిలీప్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జమ్మికుంట రూరల్ విద్యుత్ శాఖ ఏఈ రమేష్ ని మీడియా ప్రతినిధులు వివరణ కోరగా ఈ సందర్భంగా ఏఈ రమేష్ మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖకు సంబంధించిన అధికారులు సబ్ స్టేషన్ నిర్మాణం కోసం సుమారు ఎకరం భూమి విద్యుత్ శాఖ కి అందించినట్లుగా తెలిపారు.. వీటికి అధికారికంగా ఎలాంటి రాతపూర్వకమైన పత్రాలు లేవని ఇరిగేషన్ శాఖ వారు ఇచ్చిన సూచన మేరకు ఇందులో నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.



# మలేసియా అంతర్జాతీయ సదస్సుకు మండల వాసి ఎంపిక

**మల్లాపూర్, అక్టోబర్ 14, ప్రజాజ్యోతి**



జపాన్ లోని ప్రముఖ ఎంగార్డ్ ఎనాజిక్ టెక్నాలజీ సంస్థ వారి ఆధ్వర్యంలో అక్టోబర్ 18 నుండి 20 వరకు మలేసియా దేశంలో నిర్వహిస్తున్న ప్రొడక్ట్ ట్రైనింగ్ అలాగే వ్యాపార నిర్వహణ రహస్యాల వర్క్ షాప్ కి జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని కుస్తాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ సైకాలజిస్ట్ అడ్డిగ శ్రీనివాస్ ఎంపిక చేయబడ్డారు. డిజిటల్ టెక్నాలజీ, బిజినెస్ బిల్డింగ్ సీక్రెట్స్ పై ఎమ్గార్డ్ ఎనాజిక్ సమ్మిట్ పేరుతో ప్రతిష్టాత్మకంగా మలేసియా దేశం లో మూడు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సుకి పాల్గొనవాల్సిందిగా ప్రముఖ సైకాలజిస్ట్ అడ్డిగ శ్రీనివాస్ కి ఆహ్వానం అందింది. ప్రపంచం నలుమూలల నుండి 1000 మందికి పైగా వివిధ రంగాల్లో పేరుగాంచిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొనే అవకాశం వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని ప్రముఖ సైకాలజిస్ట్ అడ్డిగ శ్రీనివాస్ తెలిపారు.

# కల్వల వెంకటేష్ ను అభినందించిన ఎమ్మెల్యే విజయ రమణారావు

**సుల్తానాబాద్, అక్టోబర్ 14, ప్రజా జ్యోతి**



ఇటీవలే ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించిన కల్వల వెంకటేష్ ను అభినందించిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సుల్తానాబాద్ పట్టణంలోని సుభాష్ నగర్ కు చెందిన కల్వల వెంకటేష్ ఇటీవలే డీఎస్సీ ఫలితాలు వెలుపడగా అందులో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ గా ఉద్యోగాన్ని పొందిన కల్వల వెంకటేష్ ను సోమవారం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసి అభినందించిన ఎమ్మెల్యే విజయ రమణారావు మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అధ్యక్షుడు రవి, తిరుపతి కుమార్ కిషోర్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

# హ్యాండ్ బాల్,నెట్ బాల్ లో రాష్ట్రస్థాయికి ఎంపికైన ఆల్ఫోర్స్ కళాశాల క్రీడాకారులు



*కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 14, ప్రజాజ్యోతి*

క్రీడల ద్వారా విద్యార్థులకు చాలా మేలు చేస్తుందని వారిని వివిధ రంగాలలో అగ్రగామిగా కొనసాగినందుకు చేయూతనిస్తుందని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లి, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో ప్రత్యక్షంగా ఏర్పాటు చేసినటువంటి విద్యార్థుల అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొని మానసిక ఉల్లాసాన్ని పొంది చదువులో రాణించి లక్ష్యాలను సాధించాలని కోరారు అనుభవజ్ఞులైన వ్యాయామ ఉపాధ్యాయలచే కళాశాలలో విద్యార్థులకు శిక్షణ ఇప్పిస్తూ వివిధ స్థాయిలలో నిర్వహింపబడి పోటీలకు ఎంపిక చేస్తున్నామని చెప్పారు. కళాశాల స్థాయిలో అత్యుత్తమంగా ప్రవేశించిన విద్యార్థులు ఇటీవల కాలంలో ఆల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్ కొత్తపల్లిలో నిర్వహించబడిన అండర్ 19 జూనియర్ కళాశాల జిల్లాస్థాయి పోటీలలో కళాశాల చెందిన విద్యార్థినులు నెట్ బాల్ లో జి.ఎలిన జోన్న షారూన్,ఎం రక్షిత,హ్యాండ్ బాల్ లో జి.ఎలిన జోన్న షారూన్ ఎంపికయ్యారని హర్షం వ్యక్తం చేశారు.

# 26 నుండి రేకుర్తి కంటి ఆసుపత్రిలో ఓక్యులోప్లాస్టీ సేవలు

*కరీంనగర్ రూరల్, అక్టోబర్ 14, ప్రజాజ్యోతి*

కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రిలో ఈనెల 26 నుండి ఓక్యులోప్లాస్టీ సేవలు ప్రారంభిస్తున్నట్లు ఆసుపత్రి చైర్మెన్, ట్రస్ట్‌బోర్డు సభ్యులు కొండా వేణుమూర్తి తెలిపారు. సోమవారం ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కంటి కాన్సర్‌కు సంబంధించి కనురెప్పలు,కన్నీటి వాహిక అడ్డంకులు,కక్ష్య పగులు, కళ్లచుట్టూ కణుతుల సమస్యలు ఉన్నవారు ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. కనురెప్పలు, కన్నీటి వాహిక అడ్డంకుల చికిత్స,కక్ష్యపగులు చికిత్స,కళ్ళచుట్టూ కణితులను తొలగించుట, కృతిమ కన్ను కనురెప్పలను అమర్చుట, ముక్కులోకి కన్నీళ్ళ ప్రవాహాన్నిపునరిద్దరించడం, చూపు లేని కంటిలో నొప్పిని తగ్గించుట, ఎగువ దిగువ కనురెప్పల జంక్షన్ వద్ద కణజలాన్ని ఓక్యులోప్లాస్టీ శాస్త్ర చికిత్స ద్వారా మెరుగుపరచడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశలో ట్రస్టు బోర్డు సభ్యులు చిదుర సురేష్, ప్రకాష్‌హోల్లా, బొమ్మపవన్‌కుమార్, కోల అన్నారెడ్డి, టి.మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# బస్ స్టేషన్ లో ప్రయాణీకుల రద్దీని పర్యవేక్షించిన రీజనల్ మేనేజర్



*కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 14, ప్రజాజ్యోతి*

కరీంనగర్ రీజనల్ మేనేజర్ ఎన్.సుచరిత డా. బి.ఆర్. అంబేద్కర్ బస్ స్టేషన్, కరీంనగర్ లో బతుకమ్మ, దసరా పండగలకు వచ్చి తిరుగు ప్రయాణములో భాగంగా వివిధ రూట్లలో ప్రయాణీకుల రద్దీని పర్యవేక్షించారు. ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా అవసరమైన బస్సులు ఏర్పాటు చేయాలని బస్ స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ సురేశ్, స్టేషన్ మేనేజర్ శ్రీ ఎన్. అంజయ్యలకు సూచించారు. ప్రయాణీకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అన్నారు. ప్రయాణీకుల సౌకర్యార్థం దాదాపు 200 అదనపు బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ తో డిప్యూటీ రీజనల్ మేనేజర్ (మెకానికల్ ) శ్రీ కె. సత్యనారాయణ, అకౌంట్స్ ఆఫీసర్ శ్రీ సి. హెచ్. వెంకటేశ్వర్లు,కరీంనగర్ 1 డిపో మేనేజర్ ఐ. విజయమాధురి వున్నారు.

# పరిశుభ్రమైన చేతులు-ఆరోగ్య ప్రదాతలు

## పమేలా సత్పతి – జిల్లా కలెక్టర్




*కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 14, ప్రజాజ్యోతి*

ప్రతినిత్యం, అత్యవసర, అతి ముఖ్య సమయాలలో తప్పనిసరిగా చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని, తద్వారా చేతుల అపరిశుభ్రత వల్ల వచ్చు అనేక వ్యాధులను దూరం చేసుకోగలుగుతామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. అక్టోబర్ 15 "ప్రపంచ చేతుల శుభ్రత దినోత్సవం" సందర్భంగా యూనిసెఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన 'బ్యానర్' ఆవిష్కరిస్తూ, ప్రజలందరికీ ప్రత్యేకంగా పారిశుధ్య పనులలో నిమగ్నమయ్యే కార్మికులకు, "చేతుల పరిశుభ్రత "విషయాన్ని చేరవేయాలని, యూనిసెఫ్ ఈ దిశగా తమ వంతు ప్రయత్నం చేస్తుందని ఉద్ఘాటించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో, పాఠశాలల్లో, మహిళా సంఘాల సమావేశాల్లో "చేతుల శుభ్రత – ఆరోగ్య భద్రత" అంశాన్ని విస్తృత ప్రచారం చేయాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, సహాయ కలెక్టర్ అజయ్ యాదవ్, అధికారులు డిఆర్డిఓ శ్రీధర్, సీఈవో శ్రీనివాస్ ,డిపిఓ రవీందర్ ,మున్సిపల్ కమిషనర్ చహత్ బాజ్పాయ్, డీఈవో జనార్దన్ రావు, యూనిసెఫ్ రాష్ట్ర ప్రతినిధి కాశీనాథ్, జిల్లా సమన్వయ కర్త కిషన్ స్వామి, ఎస్బిఎం రమేష్, వేణు, కళ్యాణి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ సాయిబాబా మృతి మానవహక్కుల ఉద్యమానికి తీరనిలోటు

## జైల్లో సరైన వైద్యం అందించకుండా కేంద్రమే సాయిబాబాను హత్య చేసింది

## సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు




*కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 14, ప్రజాజ్యోతి*

అణగారిన వర్గాలను పోరాటం వైపు నడిపించిన సేనాధిపతి సాయిబాబా అని, ఆయన మృతి పౌరహక్కుల ఉద్యమానికి తీరని లోటని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజులు ఒక సంయుక్త ప్రకటనలో అన్నారు.పౌరహక్కుల సంఘం నేత ప్రొఫెసర్ సాయిబాబా మృతిపై సోమ వారం వారు స్పందిస్తూ సాయిబాబాది సాధారణ మృతికాదని కేంద్రం చేసిన హత్య అని ఆరోపించారు. 90శాతం అంగవైకల్యంతో ఉన్న ఆయనపై నక్సలైటుగా ముద్రవేసి ఉపా చట్టం క్రింద ఏండ్ల తరబడి జైల్లో పెట్టి దుర్మార్గంగా వ్యవహరించిందని, అందువల్లే ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణించి మృతి చెందారన్నారు. జైల్లో ఉన్న సమయంలో వారి మాతృమూర్తి మరణించిన అంత్యక్రియలు కూడా హాజరు కావడానికి బెయిలు ఇవ్వకుండా ఎన్డీఏ ప్రభుత్వం నిరాకరించిందని పేర్కొన్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన సాయిబాబా 90% అంగవైకల్యం కలిగిన వికలాంగత శరీరానికి కాదని మనసుకు కాదని భావించి ఉన్నత చదువులు చదివి ఢిల్లీ యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా ఇంగ్లీష్ చాలా సంవత్సరాల పాటు బోధించారని ఒక మేధావిగా,రచయితగా, మానవహక్కుల కార్యకర్తగా, ఉద్యమకారుడిగా అంకిత భావంతో పని చేశారని కొనియాడారు.పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సాయిబాబా పోరాడాడని, వికలాంగులకు, దళితులకు, గిరిజనులకు, వెనుకబడిన వర్గాలకు అండగా, వారి హక్కులకోసం పోరాడిన సాయిబాబా మృతి ప్రజా పోరాటాలకు తీరనిలోటని, ఆయన మృతిపట్ల సంతాపాన్ని, కుటుంబసభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. పేద ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడేందుకు కృషి చేయాలని అదే ఆయనకు నిజమైన నివాళి కాగలదన్నారు.సాయిబాబా పార్థివ దేహాన్ని వైద్య విద్యార్థుల కోసం గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించాలని కుటుంబ సభ్యులు నిర్ణయించడం అభినందనీయం అన్నారు.

# జర్నలిస్ట్ యూసూఫ్ పై పెట్టిన అక్రమ కేసు వెంటనే ఎత్తివేయాలి





## – టిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్, సిపికి వినతి

*కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 14, ప్రజాజ్యోతి*

జర్నలిస్టు ఎండి యూసుఫ్ పై చందుర్తి పోలీస్ స్టేషన్లో పెట్టిన అక్రమ కేసును తొలగించి, అతనిని వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే తిరుపతి, కే బాపూరావు లు డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేల సత్పతి, కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతిలను కలిసి వినతి పత్రాలు అందజేశారు. కేసుకు సంబంధించిన వివరాలను కలెక్టర్, సిపి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల పోలీసులు ఇటీవల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ నేషనల్ కౌన్సిల్ మెంబర్, సిరిసిల్ల జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యుడైన జర్నలిస్టు ఎండి యూసుఫ్ కు సంబంధంలేని ఒక కేసును అంటగట్టి అతనిపై అక్రమంగా కేసు నమోదు చేశారని తెలిపారు. యూసుఫ్ పై పెట్టిన తప్పుడు కేసును ఉపసంహరింపజేసి, అతనిని వెంటనే విడుదల చేయాలని కోరారు. తప్పు చేయని జర్నలిస్టులపై ఇలా తప్పుడు కేసులు పెట్టడం తగదు. ఈ సంఘటనపై ప్రత్యేక అధికారితో విచారణ జరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ చట్ల శంకర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు గాదె కరుణాకర్, నరేష్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు పెరుక రవి జర్నలిస్టులు, ప్రసాద్, అంజయ్య, శంకర్ రెడ్డి, రవీందర్, శ్రీకాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**ఆరు గ్యారంటీలను పేరుతో ప్రజలను నట్టేట మోసం చేసింది..**

**300 రోజులైనా ఆరు గ్యారంటీలకు అతి గతి లేదు**

**ప్రజాపాలన దరఖాస్తులెన్ని పరిష్కరించారు..?**

**కాంగ్రెస్ ప్రభుత్వం ని ప్రశ్నించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...**



*వీణవంక, అక్టోబర్14, ప్రజాజ్యోతి*

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 300 రోజులు గడిచిన , ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, ముఖ్యంగా వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం నేడు ప్రజానీకాన్ని తీవ్రంగా మోసం చేసి, ప్రజల వ్యతిరేకతను మూట గట్టుకుంటుందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శించారు... సోమవారం రోజున వీణవంక మండలం లోని పలు గ్రామాల్లో బిజెపి మెంబర్షిప్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు...ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బిజెపి మెంబర్షిప్ డ్రైవ్ ముగింపుకు సమయం దగ్గర పడిందని , వీణవంక మండలం లోని నాయకులు, కార్యకర్తలందరూ మెంబర్షిప్ డ్రైవ్ ప్రోగ్రాంను సక్సెస్ చేయాలన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వవైఫల్యాన్ని ప్రజలకు వివరించి , బిజెపి సభ్యత్వ నమోదులో అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యం అయ్యేలా చూడాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కోసం అన్ని వర్గాల ప్రజల ఓట్లను దండుకోవడానికి 420 హామీలను,రకరకాల డిక్లరేషన్లతో ప్రజలను మభ్య పెట్టే రీతిలో మేనిఫెస్టోను రూపొందించిందన్నారు. అధికారంలోకి వచ్చి 300 రోజులు గడిచిన మేనిఫెస్టో లో ని అంశాలను నెరవేర్చకుండా దాటవేత ధోరణి అవలంబిస్తుందన్నారు. ముఖ్యంగా సీజన్ ముగిసిన రైతు భరోసా సహాయం అందించలేదని, రెండు లక్షల రుణమాఫీ రైతులందరికీ వర్తించలేదన్నారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగుల భర్తీ కార్యక్రమం అటకెక్కిందన్నారు. వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్లను పెంచలేదని, మహిళలకు ఇస్తామన్న రూ.2500 నేటికీ అందించకుండా అర్హులైన మహిళలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. అనేక చెప్పుకుంటూ వెళితే కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా చెప్పిన ఏ ఒక్క హామీని సక్రమంగా నెరవేర్చలేదని ఆయన ఆరోపించారు. హామీలను అమలు కోసం ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరించి నెలలు గడిచిపోయిందని, వాటినీ ఎందుకు స్వీకరించిందో..? దరఖాస్తుల పరిస్థితి ఏంటో..? తెలియని పరిస్థితి ఉందన్నారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రోజుకో రాజకీయడ్రామా చేస్తుందన్నారు... ఇష్యూ డైవర్ట్ పాలిటిక్స్ కు, టైంపాస్ రాజకీయాలకు కాంగ్రెస్ అలవాటు పడిపోయిందన్నారు...కులగణన పేరిట రేవంత్ రెడ్డి ప్రభుత్వం మళ్లీ ఓ డ్రామా చేస్తుందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రామిడి ఆదిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు, జిల్లా సభ్యత్వనమోదు కో కన్వీనర్ చెన్నమధవుని నర్సింహరాజు, మండల ప్రధాన కార్యదర్శి సదానందం, నాయకులు గణపతి, సారయ్య, మాజీ ఎంపీటీసీ మోరే స్వామి, బూత్ అధ్యక్షులు సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నియోజకవర్గం కన్వీనర్ గా ఎడ్ల జోగిరెడ్డి

*కరీంనగర్ బ్యూరో, ప్రజాజ్యోతి*



కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కేంద్రానికి చెందిన ఎడ్ల జోగి రెడ్డి గత రెండు దశాబ్దాల క్రితం తెలంగాణ ఉద్యమం పోరాటంలో చురుకైన పాత్ర పోషించారు. ఉద్యమ పోరాట సమయంలో అనేక మంది మహానేతలు, నాయకులతో కలిసి ఉద్య మంలో పాల్గొని చురుకైన పాత్ర పోషించారు. తెలం గాణ ఉద్యమంలో ఎడ్ల జోగిరెడ్డి చేసిన సేవలను గుర్తించిన రాష్ట్ర తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కన్వీనర్ చీమ శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మానకొండూరు నియోజక వర్గం కన్వీనర్ గా ఎడ్ల జోగి రెడ్డిని నియామకం చేసినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎడ్ల జోగిరెడ్డి మాట్లాడుతూ. నా యొక్క నియామకానికి సహకరించిన ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్, ముఖ్య సలహాదారుడు ఓరుగంటి ఆనంద్, జిల్లా చైర్మన్ కనకం కుమార స్వామి లతో పాటు వివిధ మండలాల అధ్యక్షులు, రాష్ట్ర నాయకు లకు, జిల్లా బాధ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఉద్యమం పుట్టి దాదాపు 23 ఏళ్లు పూర్తిగా అయ్యింది అని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత అధికారం చేపట్టిన టిఆర్ఎస్ ప్రభుత్వం అసలైన తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరులు వారి కుటుంబాలను విస్మరించిందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులు, అమరవీరులు, ఉద్యోగ సంఘాలతో పాటు కుల,మతాలకతీతంగా సబ్బండ వర్గాల పోరాటంతోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైంది అన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత మొదటిసారి అధికారం చేపట్టిన టిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన మహానేతలు, అమరవీరులు, ఉద్యమ నాయకులు, కార్యకర్తలు, జర్నలిస్టులను విస్మరించిందన్నారు. దాని ఫలితమే ఇటీవల టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయిందని అన్నా రు. కనీసం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా తెలం గాణ ఉద్యమ పోరాటంలో పాల్గొన్న ఉద్యమకారులు, అమరవీరులు వారి కుటుంబాలు, నాయకులను, కార్యకర్తలను, జర్నలిస్టులను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యత ఇచ్చి, అన్ని రకాలుగా సహాయ, సహకా రాలు అందజేయాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

# ఇంద్రకీలాద్రికి పాదయాత్రలో భవానీ భక్తులు

**జమ్మికుంట నుండి బయలుదేరిన దుర్గామాత భక్తులు**

*జమ్మికుంట, అక్టోబర్ 14, ప్రజాజ్యోతి*

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గామాత ఆశీస్సులతో మాల ధరించి 11 రోజులు ఉపవాస దీక్షలు చేసి మాల విరమణ కోసం జమ్మికుంట నుండి విజయవాడ కు పాద యాత్ర గా బయలుదేరిన ముగ్గురు యువకులు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి కి చెందిన మారుతి, రెడ్డి ప్రశాంత్, మహేష్ అనే యువకులు దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గామాత మాల ధరించి భక్తి శ్రద్ధలతో పూజలు చేసి తమ మాల విరమణ కోసం సోమవారం కొత్తపల్లిలోని హనుమాన్ దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించి జమ్మికుంట నుండి విజయవాడ కు సుమారు 270 కిలోమీటర్లు కాలినడకన బయలుదేరారు. ఈ కార్యక్రమంలో యువశక్తి యూత్ అసోసియేషన్ సభ్యులు యువశక్తి యూత్ సభ్యులు



అయితు శ్రీనివాస్, సోనియా, సమత, మల్లికార్జున్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తా...

**నూతన గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం**

*కరీంనగర్ బ్యూరో, ప్రజాజ్యోతి*



జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ అన్నారు. సోమవారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించిన సంధర్భంగా ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఆ య న మాట్లాడుతూ తన రాజకీయ జీవితమంతా ఆదిలాబాద్ జిల్లాతో ముడిపడి ఉందన్నారు. పలువురు సీనియర్ నాయకులతో కలిసి పనిచేశానని, ఆదిలాబాద్ లో డోర్ టు డోర్ తిరిగానన్నారు. ఇంద్రవెల్లిలో జరిగిన సభకు రేవంత్ రెడ్డి ని రప్పించి సభ సక్సెస్ చేయించానని పేర్కొన్నారు. అటు టిడిపిలో, ఇటు కాంగ్రెస్ లో ప్రస్తుత సిఎం రేవంత్ రెడ్డి సంపూర్ణ సహకారం తో ఎన్నో పదవులు నిర్వహించానని తెలిపారు. టిడిపిలో ఉండగా రేవంత్ రెడ్డి, చంద్రబాబుతో పరిచయమయ్యారన్నారు. పనిచేయడంలో చిత్తశుద్ధి,నిజాయితీ, బాధ్యతతో పనిచేయడం తన నైజమని పేర్కొన్నారు. సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా రూ. 1.15 లక్షల జీతానికి పనిచేసిన తాను 2013లో విరమణ తీసుకుని రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి గంగాధర మండలం కొలిమికుంట గ్రామ బిడ్డగా పరిచయమైన తాను ఎంకామ్, పి హెచ్ డి పూర్తి చేసి కీ టూ సక్సెస్ ఫర్ కామర్స్ అనే పుస్తకాన్ని రాశానని తెలిపారు. గ్రంథాలయ చైర్మన్ గా పూర్తి అవగాహన పెంచుకుని అభివృద్ధికి కృషి చేస్తానని, ఆగిపోయిన.నూతన భవన నిర్మాణం. డిజిటల్ లైబ్రరీ విషయంలో ముందడుగు వేస్తానన్నారు. బడ్జెట్ ఉన్నా లేకున్నా ఒక నెలలో పోటీ పరీక్షల విద్యార్థులకు సొంతంగా రూ.20 లక్షల రూపాయలతో మెటీరియల్ అందజేస్తానని పేర్కొన్నారు. మండల కేంద్రాలలో ఉన్న గ్రంథాలయాలపై దృష్టిసారిస్తానన్నారు.

## సద్దుల బతుకమ్మ సంబరాలు

*జగిత్యాల్, అక్టోబర్ 14, ప్రజా జ్యోతి:*



రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామంలో సద్దుల బతుకమ్మ సందర్భంగా సుతారి తిరుపతిరెడ్డి గ్రామ పంచాయతీ సిబ్బందికి బట్టలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బంది చాలా సంతోషంగా బతుకమ్మ సంబరాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అత్తినేని గంగిరెడ్డి సెక్రెటరీ శేఖర్ సింగిల్ విండో చైర్మన్ రాజలింగం ఎంబారీ వెంకటేష్ గ్రామపంచాయతీ కారోబార్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పూలే విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై హుజురాబాద్ లో ప్రజా సంఘాల నిరసన

*హుజురాబాద్, అక్టోబర్ 14, ప్రజాజ్యోతి*



వరంగల్ జిల్లా దేశాయిపేటలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై నిరసిస్తూ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మహాత్మ జ్యోతి రావు పూలే ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ సందెల వెంకన్న ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. విగ్రహాలను కూల్చడం, ధ్వంసం చేయడం వల్ల మహాత్ముల చరిత్రను చెరిపి వేయలేరని అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే బడుగు, బలహీన వర్గాల చైతన్యం కోసం ఎంతో పాటు పడ్డారని అన్నారు. మహాత్ముల విగ్రహాలను కూల్చి వేస్తున్న, ధ్వంసం చేస్తున్న సంఘ విద్రోహ శక్తుల పై కఠినమైన చట్టాలను ప్రయోగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు చందుపట్ల జనార్ధన్, పసుల స్వామి, మాదుగుల ఓదలు, ములుగు రవి, ఏనూరి అశోక్, తాళ్లపల్లి అమరేందర్, కోదూరి సమ్మయ్య, చల్లూరి రాజు, సిరికొండ సమ్మయ్య, గిరవేణి శ్రీకాంత్, మిడిదొడ్డి రాజు తదితరులు పాలొన్నారు.

# నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ సంబరాలు





**జగిత్యాల్, అక్టోబర్ 14, ప్రజా జ్యోతి**

రాయికల్ మండలం సింగరావు పేట గ్రామంలో బతుకమ్మ సందర్భంగా గౌరమ్మను పసుపు రంగు పూలతో పేర్చి తొమ్మిది రోజులపాటు ఆటపాటలాడి తొమ్మిది రోజుల పాటు కొనసాగే బతుకమ్మలను చెరువులో లేదా నీటి నదీ ప్రవాహంలో నిమజ్జనం చేస్తారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని సాగే ఈ పాటల్లో మహిళలు తమ కష్టసుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి, భయం, చరిత్ర, పురాణాలు మేళవిస్తారు. బతుకమ్మ పాటలు చాలా వినసొంపుగా ఉంటాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఈ బతుకమ్మ పండుగ, తెలంగాణ అస్తిత్వం బతుకమ్మలోనే ఉంది. తెలంగాణ నేలపై బతుకమ్మ పండుగను శతాబ్దాలుగా జరుపుకుంటున్నారు.

# బ్రమ్మయ్యను సన్మానించిన పాఠశాల కరస్పాండెంట్



**మల్లాపూర్ అక్టోబర్ 14, ప్రజాజ్యోతి:**

మండల కేంద్రంలోని సరస్వతి విద్యాలయంలో 2008–09 విద్యను అభ్యసించిన పూర్వపు విద్యార్థి వైజాగ్ కస్టమ్స్ ఫైనాన్స్ ఇన్స్పెక్టర్ గా ఉంద్యోగం సాధించినా బండారి బ్రమ్మయ్యను సరస్వతి విద్యాలయం కరస్పాండెంట్ సిరిపురం రవీందర్ సన్మానించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యను అభ్యసించి కస్టమ్స్ ఆఫీసర్ గా ఉద్యోగం సాధించడం గర్వంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇట్టేడి నారాయణరెడ్డి, మరిపెల్లి మల్లయ్య, పూర్వపు విద్యార్థులు సిరిపురం వినోద్, చందనగిరి నరేష్, సిరిపురం వసంత్, గట్ల సంతోష్, ఎండి అప్సర్, పెద్దినేని అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నిలిచిన ప్రసూతి ఆపరేషన్లు...

# గర్భిణీల నరకయాతన..

**హుజురాబాద్, అక్టోబర్ 14, ప్రజా జ్యోతి**



హుజురాబాద్ లో పెద్ద దిక్కుగా ఉన్న ఏరియా ఆసుపత్రిలో 4 గంటల పాటు గర్భిణీలు నరక యాతన అనుభవించారు. గైనకాలజీ వైద్యులు అందుబాటులో ఉన్నప్పటికీ.. మత్తు మందు ఇచ్చే వైద్యుడు అందుబాటులో లేక ఆపరేషన్ల కోసం పురిటి నొప్పులతో నాలుగు గంటలు గర్భిణీలు ఎదురు చూశారు. వారి గోడును పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రసూతి కోసం వెన్నంపల్లి, బోర్నపల్లి తదితర గ్రామాల నుంచి వచ్చిన ఆరుగురు గర్భిణీల బంధువులు వారి ఇబ్బందిని చూసి సిబ్బందితో గొడవకు దిగారు. ప్రసూతి చేస్తామని ఉదయం 10 గంటలకు ఏం తినకుండా ఖాళీ కడుపుతో రమ్మనడంతో... గర్భిణీలు వచ్చి యూరిన్ బ్యాగ్ బెడ్ల పై పడుకున్నారు. వైద్యులను అడిగితే 12 గంటలకని తర్వాత రెండు గంటలకు అని సాయంత్రం నాలుగు గంటల వరకు కూడా ఆపరేషన్ చేయలేదని వారు రోధించారు. గర్భిణీల బంధువులు సూపరింటెన్డెంట్, ఆర్ఎం, డీఎంహెచ్వోకు ఫోన్ చేసిన సరైన సమాధానం చెప్పడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మత్తు డాక్టర్ తీరిగ్గా సాయంత్రం 5 గంటలకు రావడంతో యధావిధిగా ఆపరేషన్లను నిర్వహించారు.

# మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాకి కొవ్వొత్తులతో ఘన నివాళి

**జమ్మికుంట, అక్టోబర్ 14, ప్రజా జ్యోతి**



ఢిల్లీ విశ్వవిద్యాలయ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మృతి కి సంతాపంగా జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో అభిమానులు, ప్రజా సంఘాల నాయకులు క్రోవత్తులతో ఘనంగా నివాళులు అర్పించారు. జోహార్.. జోహార్ సాయి బాబా అంటూ ఆయన ఆశయాలను కొనసాగిస్తామని నినదించారు.. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి తిరుపతయ్య, కార్మిక నాయకుడు తెలంగాణ హమాలి కార్మిక సంఘం అధ్యక్షుడు గుంటి సామ్రాజ్యం మాట్లాడుతూ పది సంవత్సరాలు జైలు జీవితం అనుభవించి ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజాస్వామ్య వేదికలను, సమాజాన్ని చైతన్య పరచడం కోసం కృషి చేసిన ప్రొఫెసర్ సాయిబాబాని ఈ రాజ్యము అర్బన్ నక్సలైట్ గా ద్రోహం మోపి జైల్లో నిర్బంధించడం, కనీసం వికలాంగుడు అని కూడా చూడకుండా దుర్భరమైనటువంటి జైల్లో నిర్బంధించడం వలన అనారోగ్యం పాలై చికిత్స పొందుతూ చనిపోయాడని అన్నారు... ఇది నిజంగా ప్రభుత్వం చేసిన హత్యని వారు విమర్శించారు. సాయిబాబా అనేక ప్రజాస్వామిక సంఘాలకు మద్దతు తెలుపుతూ ప్రజాస్వామ్య తెలంగాణ కోసం మొట్టమొదటిసారిగా వరంగల్ డిక్లరేషన్ లో మద్దతు తెలుపడం జరిగిందని, పీడిత, తాడిత, ఆదివాసుల హక్కుల కోసం నిరంతరం కృషి చేసాడని అటువంటి తెలంగాణ వాదిని కోల్పోవడం తెలంగాణ వాసులందరికీ చాలా బాధాకరమని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి తిరుపతయ్య, కార్మిక నాయకుడు తెలంగాణ హమాలి కార్మిక సంఘం అధ్యక్షుడు గుంటి సామ్రాజ్యం, డిటిఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు అవాల నరహరి, ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు రామంచ భరత్, మర్రి అవినాష్ టిపిటిఎఫ్ నాయకులు, డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏబూసి శ్రీనివాస్, జమ్మికుంట ప్రజాస్వామిక సంస్థల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మళ్ళా... ఎప్పుడొస్తావు బతుకమ్మ.. వెళ్లిరావమ్మా బతుకమ్మ..

**– సంస్కృతిని ప్రతిబింబించేలా పూల పండుగ**

**– తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చిన మహిళలు**

**– ఆటపాటలతో మహిళలు, యువతుల సందడే సందడి**

**మల్లాపూర్, అక్టోబర్ 14, ప్రజాజ్యోతి:**



తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ ఊరూరా సందడి తెచ్చింది. ఆడబిడ్డలకు ప్రీతిపాత్రమైన పండుగ, పదకొండు రోజులపాటు ఊరువాడను ఒక్కటి చేసే వేడుక, పది రోజులపాటు బతుకమ్మ ఆడిన మహిళలు పదకొండో రోజు సంబురంగా సద్దుల బతుకమ్మ పండుగను జరుపుకున్నారు. మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో మహిళలు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చిన మహిళలు గౌరమ్మను ప్రతిష్ఠించి నియమ నిష్టలతో పూజలు చేశారు. సప్త వర్ణాలు పులుముకున్న తీరొక్క పూలను సేకరించిన మహిళలు.. ఆకర్షణీయంగా రంగులద్దడంతో మరింత శోభను సంతరించుకున్నది. సద్దుల బతుకమ్మ పండుగకు పుట్టింటికి చేరిన ఆడబిడ్డలు రంగుల పూలను వరుసగా పేర్చి శిఖరంలా అందంగా ముస్తాబు చేశారు. పైన గౌరమ్మను ప్రతిష్ఠించి మదినిండా తలుస్తూ భక్తి శ్రద్ధలతో బతుకమ్మకు పూజలు చేశారు. బతుకమ్మలను దించి 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.., చిత్తూ చిత్తూల బొమ్మ..





అంటూ మహిళలు, యువతులు పాటలు పాడుతూ సందడి చేశారు. బతుకమ్మలను గంగమ్మ ఒడికి చేర్చి వెళ్లి రావమ్మా అంటూ వీడ్కోలు పలికారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకొని వెంట తెచ్చిన పిండి పదార్థాలను పంచుకొని ఇంటిదారి పట్టారు.